క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాధాకృష్ణ నగర్‌లో తీవ్ర నీటి సమస్యతో అల్లాడుతున్నామని, తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కోరారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నాగుల సత్యం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో జలమండలి అధికారులతో సమావేశమై నియోజకవర్గంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఏ. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు కృష్ణ, సభ్యులు మల్లేష్, శ్రీరాములు, ఐజాక్, లాజరస్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్నేహపురి కాలనీ అధ్యక్ష ఎన్నికలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం స్థానిక షిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో జరుగనున్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సంఘం సురేందర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష బరిలో ఇద్దరు పోటీల్లో ఉన్నారని తెలిపారు. ఎన్నికల అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

వాసన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత గ్లకోమా పరీక్షలు



క్యాంప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పీఎన్‌ఆర్ ఎంపైర్ కాంప్లెక్స్‌లోని వాసన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో 'ఉచిత గ్లకోమా స్క్రీనింగ్ ప్రోగ్రాం' క్యాంప్‌ను శనివారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్లకోమా అనేది చాలా ప్రమాదకరమని, 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు పరీక్షను ఉచితంగా చేయించుకోవటానికి అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ రవికుమార్, గ్లకోమ డాక్టర్ మయూరి తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరువు నెర్రబారింది!

చుట్టుపక్కల ప్రాంతాలకు ఇదే ప్రధాన చెరువు

నిండుకుండలాంటి నల్ల చెరువు నెర్రబారింది.. దశాబ్దాలుగా రైతులకు నీటిని అందించింది. వ్యవసాయం అనంతరం మూడు దశాబ్దాలుగా కూకట్‌పల్లి ప్రాంతీయులకు భూగర్భ జలాలను అందిస్తూ ప్రజలను ఆదుకుంటుంది. ఇంత ప్రధానమైన చెరువును అభివృద్ధి చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామన్న పాలకుల మాటలు నీటిమీద రాతలుగానే మిగులుతున్నాయి. అభివృద్ధి చేస్తామని చెరువులోని నీటిని హైడ్రా అధికారులు తొలగించారు. అభివృద్ధి పనుల్లో జాప్యంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- అభివృద్ధి పేరుతో నీటిని తొలగించిన హైడ్రా
- పనులు ముందుకు సాగని వైనం



హైడ్రా అధికారులు నీటిని తోడేయటంతో ఎండిపోయిన నల్ల చెరువు

కూకట్‌పల్లి:

2012లో నల్ల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ప్రజలకు అనుగుణంగా చెరువులో నీటిని నిల్వ ఉంచుతామని, మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించారు. నేటి వరకు కూడా నల్ల చెరువు అభివృద్ధి చెందలేదని స్థానికులు తెలిపారు. జనాభాకు అనుగుణంగా పట్టణ ప్రాంతంగా మారిన ఇక్కడి భూములు ప్లాట్లుగా ఏర్పడి ఇళ్ల నిర్మాణం కూడా జరిగాయి. జనావాసాల మధ్య ఉన్న నల్ల చెరువు ఒక్కటే ఖాళీగా ఉండటంతో ఆ చెరువును అభివృద్ధి చేస్తామంటూ ప్రకటనలు చేసిన అనంతరం ఏదో ఒక అడ్డంకి వచ్చి వెనక్కి వెళుతోంది. దీంతో నల్ల చెరువు అభివృద్ధి మూడు అడుగులు ముందుకు వెళ్తే ఏడు అడుగులు వెనక్కి వెళ్తుంది. గతంలో బీఆర్‌ఎస్ పాలనలో నల్ల చెరువు అభివృద్ధి కోసం నిధులు కూడా మంజూరయ్యాయి. ఇందులో భాగంగానే నల్ల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మినీ పార్కును ఏర్పాటు చేశారు. అయితే చెరువులో సగభాగం పూర్తి అయిన తరువాత పట్టాదారులు తమ పట్టా భూములకు సరైన నష్ట పరిహారం ఇచ్చిన తరువాతనే అభివృద్ధి పనులు చేపట్టాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో చెరువు అభివృద్ధి పనులు మొ త్తం ఆగిపోయాయి. అనంతరం పట్టాదారులను, అధికారులను సమన్వయం చేసి అభివృద్ధి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో ప్రభుత్వం మారడంతో నల్ల చెరువు అభివృద్ధి జరగలేదు.

హైడ్రా ఆధీనంలోకి చెరువు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత చెరువుల పరిరక్షణకు ఏర్పడిన హైడ్రా నల్ల చెరువుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఏర్పడిన నిర్మాణాలను తొలగించారు. అనంతరం చెరువు పూర్తిగా హైడ్రా ఆధీనంలోకి వెళ్లింది. హైడ్రా అధికారులు కొంత కాలంగా నల్ల చెరువు అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రారంభించారు. అయితే ఇక్కడ ఉన్న న్యాయపరమైన చిక్కులు ఉండటంతో వారు కూడా వెనక్కు వెళ్లారా? అనే అనుమానాలు వస్తున్నాయి. ముందుగా హైడ్రా అధికారులు నల్ల చెరువును అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేయాలని చెరువులో ఉన్న నీటి మొత్తాన్ని బయటకు పంపారు. అనంతరం రెండు రోజుల పాటు పనులు కొనసాగించారు. దాదాపు రెండు వారాలుగా ఇక్కడ పనులను నిలిపి వేసిన హైడ్రా అధికారులు కిమ్మనకుండా ఉన్నారు. అసలే వేసవి కాలం కావటంతో భూగర్భ జలాలన్నీ అడుగంటి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న సమయంలోనే చెరువును పూర్తిగా నీటిని తోడి ఎండబెట్టడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారులు అభివృద్ధి విషయంలో జాప్యం చేయటం వల్ల ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఇప్పటి వరకు భూగర్భ జలాలు అడుగంటకుండా నల్ల చెరువు ఎంతో ఉపయోగపడింది. హైడ్రా అధికారులు అభివృద్ధి పేరుతో నీళ్లను తోడివేసి పూర్తిగా ఎండబెట్టడంతో స్థానికంగా బోర్లు ఎండిపోయాయి. ఓ పక్కన మంచినీటి సరఫరా అంతంత మాత్రంగా ఉన్నాయి. బోర్లు ఎండిపోతే ప్రజలు ఈ వేసవిలో మంచినీటి కష్టాలు తప్పేటట్టు లేదు. అధికారులు నల్ల చెరువు అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వేగవంతం చేయాలి.

–మర్యాద అశోక్, శేషాద్రినగర్

నీళ్లు లేక ఇబ్బందులు

నల్ల చెరువు అభివృద్ధి విషయంలో ఇక్కడి ప్రజలకు ఎన్నో అనుమానాలు ఉన్నాయి. గతంలో కూడా అభివృద్ధి పేరుతో ప్రభుత్వం చేసిన ప్రకటనలు ఒక్కటి కూడా ఆచరణకు రాలేదు. ఒకవైపు చెరువు స్థలాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులు వాదిస్తుండగా.. అది తమ పట్టా భూములంటూ రైతులు చెబుతున్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను అయోమయానికి గురి చేసి స్థానికంగా చెరువులో నీళ్లు లేకుండా చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

–ప్రకాష్ రావు, కూకట్‌పల్లి

పగలే వెన్నెలా..! పట్టించుకోరెలా?

పట్టపగలూ వెలుగుతున్న వీధి దీపాలు

ఆల్విన్‌కాలనీ: అసలే వేసవి కాలం. చాలీ చాలని విద్యుత్ సరఫరాతో రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చేయాలని నిరంతర విద్యుత్‌ని అందిస్తుంది. వివిధ కాలనీల్లోని విద్యుత్ దీపాలు పట్టపగలూ వెలుగుతున్నాయి. వాటిని ఆఫ్ చేయకుండా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్, రిక్షాపుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డినగర్, ప్రగతినగర్, దీనబంధు కాలనీల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నెల రోజులుగా వీధి లైట్లు వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. టైమర్ ద్వారా ఆన్ ఆఫ్ చేయాల్సిన విద్యుత్ సిబ్బంది ఆన్‌ఆఫ్ చేయకపోవటంతో పట్టపగలు వెలుతురు చిమ్ముతుండగా, పలు ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో వెలగాల్సిన విద్యుత్ లైట్లు వెలగటం లేదు. ప్రతి వీధిలో పగలే వీధి దీపాలు వెలుగుతుండటంతో స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు తెలిపారు. విద్యుత్ ఉన్నతాధికారులు కాలనీ, బస్తీల్లో పర్యటించి పట్టపగలు వీధిలైట్లు వెలుగుతున్న ప్రాంతాలను పరిశీలించి వాటిని ఆఫ్ చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగకుండా చీకటి మయంగా ఉన్న ప్రదేశాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రిక్షాపుల్లర్స్ కాలనీ, పాపిరెడ్డినగర్‌లలో..

అంగన్‌వాడీకి వాటర్ ట్యాంక్ అందజేత



మోతీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండ, రామారావు నగర్ కమిటీ హాల్‌లో గనమాస్ నారి శక్తి మహిళా వృత్తి విద్యా విభాగం వారు అంగన్‌వాడీ కేంద్రానికి శనివారం వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. గనమాస్ 'గిఫ్ట్ ఏ నీడ్ అండ్ మేక్ ఏ స్మైల్ ఫౌండేషన్' వ్యవస్థాపకులు లయన్ మాదినేని కల్యాణి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గోల్డెన్ జూబ్లీ ప్రెసిడెంట్ లయన్ కిరణ్‌కుమార్, విశేష అతిథిగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నేరేడ్‌మెంట్ ప్రెసిడెంట్ లయన్ శ్రీనివాస్ హాజరై వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రామారావు నగర్ కమిటీ ప్రెసిడెంట్ వెంకటయ్య, జనరల్ సెక్రటరీ వెంకట రమణ, ఎస్. మహేష్‌యాదవ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నిజాంపేట్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేయనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్, మండల, మున్సిపల్, కార్పొరేషన్ కేంద్రాలలో ఉదయం 10:30 గంటలకు దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నీటి ఎద్దడిని నివారించాలి



అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు

మూసాపేట: వివిధ డివిజన్‌లలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. భరత్‌నగర్ కాలనీ, జేపీ నగర్, ఎస్పీ నగర్ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, జలమండలి అధికారులు డీజీఎం శివ, మేనేజర్ జెక్కిలతో కలిసి మంచినీటి సమస్యపై శనివారం పర్యటించారు. లో ప్రెషర్‌తో మంచినీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. జేపీ నగర్ కాలనీలో 20 అడుగుల వరకు మూడు 900 డయా పైపులైన్లు వేస్తే మంచినీటి సమస్య పోతుందని కాలనీ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. రెండు, మూడు రోజుల్లో పైపు లైన్లు మార్చి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేపీ నగర్, ఎస్పీ నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం



చందానగర్: హఫీజ్‌పేట్ పీహెచ్‌సీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ మంజుల మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని నేపథ్యంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. హెచ్ఐవీ యాక్టు 2017 గురించి ఎయిడ్స్‌పై, హెపటైటిస్ బీ, సీ గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ మెగా క్యాంపులో 135 మందికి పరీక్షలు చేయడం జరిగిందని వైద్యులు తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ దివ్య, ల్యాబ్ అసిస్టెంట్ పండరి, పద్మ, ఫార్మసీ మమత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నృత్య శోభితం

మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం కళాకారులు అశ్విని, హర్షితారెడ్డి, ఐక్యతవర్మ, సాయిరామ్ భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, వినాయకకౌతం, నటేశకౌతం, బ్రహ్మానంది కౌత్వం, హంసనందిని జతిస్వరం, పరిపాహి, శ్రీచాముండేశ్వరీ కృతి, పదం, శృంగార లహరి, సురిటీ తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నమయ్యకీర్తనలకు అనుగుణంగా కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను కళాకారులు అలరించారు. కరువది సాయిశ్రావ్య శిష్యబృందం తన్వికసిరి, లాస్య, పర్ణిక, కీర్తి, మనస్వి, తాన్యశ్రీ, తదితరులు పాల్గొని బహ్మ మొక్కడే, శ్రీమన్నారాయణ, మధురాష్టకం, అష్టపది, ఇట్టి ముద్దులాడే బాలుడు, అదిగో అల్లదిగో, జగడపు చనువుల, అష్టపదిస్తోత్రం తదితర అంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. అనంతరం కళాకారులను జ్ఞాపికలతో సంస్థ నిర్వాహకులు సత్కరించారు.





శిల్పారామంలో అలరించిన భరత నాట్యం



అన్నమయ్యపురంలో ..

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాపులపై కేసు నమోదు

రూ.17 వేల విలువల గల బాటిళ్లు స్వాధీనం

నిజాంపేట్ : అక్రంగా మద్యం విక్రయిస్తున్న 3 బెల్టు షాపులపై బాచుపల్లి పోలీసుల కేసు నమోదు చేసి రూ. 17 వేల విలువగల 95 లిక్కర్ బాటిళ్లను స్వా. దీనం చేసుకున్నారు. బాచుపల్లి సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హోలీ సందర్భంగా మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టడానికి ముందస్తు చర్యగా విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాము. అధిక ధరలకు విక్రయిస్తున్న అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.17 వేలు ఉంటుందని తెలిపారు. 3 బెల్ట్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

భూ పరిరక్షణ పోరుబాటలో పాట హల్‌చల్

రాయదుర్గం: హెచ్‌సీయూలో భూపరిరక్షణ పోరుబాటలో పోరుపాట కలిసి నడుస్తోంది. విద్యార్థుల ఉద్యమానికి ఊపిరిలూదుతోంది. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని భూమిని టీజీఐఐసీ ద్వారా వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్‌ఎఫ్) విద్యార్థి సంఘం పాట ద్వారా పోరాటం చేయాలని శనివారం నిర్ణయించింది. అందుకు మొదటగా 'బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి'పాట తరహాలోనే తనదైన శైలిలో బీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం హెచ్‌సీయూ అధ్యక్షుడు ఆరోళ్ల అంజి తనదైన శైలిలో ఓ పాటను రాశారు. 'భూమి మీద భూమి గుంజి... ఎన్నెన్నో భూములు గుంజి...... కేసీఆర్‌ను మించినావురో కాంగిరేసు రేవంత్‌రెడ్డి'అంటూ గీతాన్ని విద్యార్థులు ఆలపిస్తూ, డప్పు కొడుతూ ఆకట్టుకున్నారు. సోమవారం ఈ పాటతోపాటు మరిన్ని పాటలను ఆలపిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంజి స్పష్టం చేశారు. హెచ్‌సీయూ ప్రహరీ లోపలి భూములను లాక్కోనిచ్చే ప్రసక్తే లేదని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



అంజి రాసిన పాట ఆలపిస్తున్న విద్యార్థి బృందం

బీమాతో మహిళలకు భరోసా !

- మహిళా శక్తి పేరిట సంఘాలకు ప్రత్యేక రుణాలు
- ఉచిత రుణ, ప్రమాద బీమాతో ఆర్థికసాయం
- 18 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న వారికి వర్తింపు
- జీపీ, పురపాలికల్లోని 1,09,361 సభ్యులకు ప్రయోజనం

సాక్షి,సిటీబ్యూరో: మహిళా శక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందించడానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం , వారి కోసం రెండు రకాల బీమా పథకాలను అమలులోకి తీసుకొచ్చింది. ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. పొదుపు సంఘంలో రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థికసాయం అందనుంది. ఈ బీమాతో గ్రామ పంచాయతీలతో పాటు పుర పాలక సంఘాల్లోని పొదుపు సంఘాల మహిళాసభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఈ రెండు రకాల బీమా పథకాలు కూడా అమలులోకి వచ్చాయి.

1.09 లక్షల మహిళా సభ్యులకు వర్తింపు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని రూరల్ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పనిచేస్తుండగా.. ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం అమలుచేయనున్న రెండు బీమాలు ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి.

72,450 మంది సభ్యులు

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 5 మండలాలకు ఒక జిల్లా సమాఖ్య, 5 మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా.. వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు.

◆ మెప్మా ఆధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్ లెవల్ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పనిచేస్తుండగా.. ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు.



చిరు వ్యాపారులకు రుణాలు

ఈ సంఘాల్లోని సభ్యులు చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది.

ప్రమాదబీమా రూ.10 లక్షలు

స్వయం సహాయక (పొదుపు) మహిళా సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ 100 శాతం వైకల్యం కలిగినా రూ.10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం ఉంటే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది పూర్తిగా మాఫీ చేస్తారు.

సరైన ధృవీకరణపత్రాలు అందజేయాలి

గాయాలైన మహిళలకు అంగవైకల్యం తెలిపే ధ్రువీకరణ పత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల పరిశోధన నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 60 ఏళ్లున్న మహిళలకు మాత్రమే ఇది వర్తింపజేస్తారు.

క్షేత్రస్థాయిలో అవగాహన లేదు

బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాలి. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. ఇలాంటి వాటిపై మహిళల్లో పూర్తిస్థాయిలో అవగాహన లేదు. చాలా గ్రూపుల్లో నెలవారీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

ఎంతో ప్రయోజనం

మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో సభ్యుల కుటుంబాలకు రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.